విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 02, మార్చి 2023

వైయస్సార్ పెన్షన్ కానుక పంపిణీ

విశాలాంధ్ర - నందికొట్కూరు : మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో గ్రామ సచివాలయ కన్వీనర్ యేసురత్నం,గ్రామ వాలంటరీ, గృహ రథసారథులు బుధవారం వైయస్సార్ ఫంక్షన్ కానుకను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యేసు రత్నం మాట్లాడుతూ ఒకటవ తేదీ వస్తుందంటే పెన్షన్ దారులకు ముంగిట్లో ఆనందం ఎదురొస్తుందని గ్రామ, వార్డు వాలంటర్లు ఇంటికి వచ్చి నగదు అందిస్తుంటే లబ్ధిదారుల ముఖంలో చిరునవ్వు కనిపిస్తుంది అన్నారు. టిడిపి పాలనలో పింఛన్ పొందాలంటే తల ప్రాణం తోకకు వచ్చేదని ఆ రోజుల్లో అంతంత మాత్రం వచ్చే పింఛన్ కోసం గ్రామపంచాయతీలు, రచ్చబండల చుట్టూ అధికారులు ఎప్పుడొస్తారని లబ్ధిదారులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది అన్నారు. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం ఆ బాధలను తొలగించి ఒకటవ తేదీ తెల్లవారకముందే లబ్ధిదారులకు ఇంటి వద్దకే పింఛన్ ఇచ్చే విధంగా ఏర్పాటు చేయడం చాలా సంతోషదాకా విషయం అన్నారు. సచివాలయ సిబ్బంది, గృహ రథసారథులు, వార్డు వాలంటీర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో శారీరక శ్రమ చేయకూడదు

విశాలాంధ్ర -అవుకు : అవుకు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉప్పలపాడు పరిధిలోని మంగంపేట గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్టను వైద్య అధికారి డాక్టర్ టి.వినోద్ కుమార్ ఆధ్వ ర్యంలో బుధవారం గ్రామ సచివాలయం యందు జరిగింది. ఈ కార్యక్రమంలో గర్భవతులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు,దీర్ఘకాలిక జబ్బులు గల రక్తపోటు,షుగర్ వ్యాధిగ్రసు లకు ల్యాబ్ పరీక్షలు మరియు చికిత్స చేయడం జరిగినది. వైద్యాధికారి డాక్టర్ టి వినోద్ కుమార్ మాట్లాడుతూ గర్భవతులు వీలైనంత త్వరలో తమ పేరు ఆరోగ్య కార్యకర్తలు వద్ద నమోదు చేసుకుని ప్రభుత్వం వారు అందించు పరీక్షలు అన్నీ చేయించుకుని సుఖ ప్రసవమును ప్రభుత్వ ఆసుపత్రి లో చేయించుకోవాలని తెలిపారు. హైరిస్క్ గర్భవతులను ప్రతి రోజు హెల్త్ సూపర్వైజర్లచే పర్యవేక్షణ జరిపి ఉచిత రవాణా, రక్తహీనతల గర్భవతులను బ్లడ్ ట్రాన్స్మిషన్ కొరకు ప్రభుత్వ హాస్పిటల్స్ యందు చేర్పించి తగిన చికిత్స అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం వలన ప్రజలం దరూ ఉదయం 11గంటలకు వరకు మాత్రమే పనులు ముగించుకుని ఇండ్లకు చేరుకోలేన ని, ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో శారీరక శ్రమ చేయ కూడదని, అలసట, వికారం, వాంతులు శ్వాస తీసుకోవడంలో వేగం పెరగడం, నోరు కళ్ళు పొడి మారడంశరీరంలో ఎక్కడి నుంచైనా రక్తస్రావం కావడం, డిహైడ్రేషన్ లక్షణాలు ఉన్న వెంటనే ఆశా కార్యకర్త దగ్గర లభించు ఓ ఆర్ ఎస్ ద్రావణాన్ని త్రాపుకుంటూ ప్రభుత్వ హాస్పిటల్కి వెళ్లి చికిత్స తీసుకోలేనని అన్నారు. ప్రతిరోజు తప్పనిసరిగా నాలుగు లీటర్ల నీరు త్రాగవలయునని తెలియ జేశారు. బి. మాధురి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్,బి. హేమలత ఆరోగ్య కార్యకర్త ఆశా కార్యకర్తలు,104 సిబ్బంది,అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు లేని సీఎంకు ఓటు అడిగే అర్హత లేదు

విశాలాంధ్ర - డోన్ రూరల్ : ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు లేని సీఎం జగన్మోహన్ రెడ్డికి ఓటు అడిగే అర్హత లేదని నంద్యాల జిల్లా టిడిపి ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ కూడా అవినీతితో కూడుకున్నవేనని ఆయన అన్నారు. విద్యావంతులు, మేధావులు ఆలోచించి ఓటు హక్కు వినియోగించుకొని తెలుగుదేశం పార్టీ బలపరుస్తున్న భూమిరెడ్డి రామగోపాలరెడ్డినిఅత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. డోన్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ దేవదత్తు, డోన్ టిడిపి ఇన్చార్జ్ ధర్మారం సుబ్బారెడ్డి మాట్లాడుతూ జగన్ పాదయాత్ర చేసే సమయంలో నిరుద్యోగులకు ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ను నిర్వహిస్తామని మోసగించారని అలాగే రాష్ట్రంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని ధ్వజమెత్తారు. వైసిపి పాలనలో ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తుందని కేసులు పెట్టడం దాడులు చేయడం మానుకోకపోతే రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రజలే గుణపాఠం చెబుతాం న్నారు. సీఎం శ్రీనివాసులు, ప్రజా వైద్యశాల మల్లికార్జున, వలసల రామకృష్ణ,శ్రీనివాసులుయాదవ్,మధుగౌడ్,విందు,కృష్ణ ప్రసాద్, టిడిపి యువ నాయకులు గౌతమ్ రెడ్డి పాల్గొన్నారు.

గాలికుంటు పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - చాగలమర్రి : పశువులకు గాలికుంటు వ్యాధి పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వరప్రసాద్ కోరారు.మండలంలోని చాగలమర్రి,చిన్నవంగలిలో గ్రామాలలో జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా చాగలమర్రిలో సహాయ సంచాలకులు వరప్రసాద్, చిన్నవంగలిలో పశువైద్యాధికారి దీపా కుమారిలు బుధవారం ప్రారంభించారు.చాగలమర్రిలో వంద పశువులకు, చిన్నవంగలిలో 150పశువులకు టీకాలు వేసే రైతులకు అవగాహన కల్పించారు.పాడి రైతులకు సీజనల్ వ్యాధుల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సిబ్బందికోటయ్య,రవి,సుధా,గోపాలమిత్రలు పాల్గొన్నారు.

పడిపోయిన పసుపు

- 250 ఎకరాలకు పైగా సాగు
- దిగుబడి గోరంత అప్పు కొండంత
- నడిరోడ్డున పడ్డ పసుపు రైతులు

విశాలాంధ్ర - రుద్రవరం : భూములను కౌలుకు తీసుకొని వేలాది రూపాయలుగా మునుగుత్త చెల్లించి, లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పసుపును పండించుదామన్న రైతు ఆశలు అడియాశలుగా నేడు మారుతున్న సంఘటనలు పసుపు పంట రైతులను చూస్తున్నాము. వివరాలలోకి వెళితే మండల పరిధిలోని రుద్రవరం, ఆలమూరు,రెడ్డిపల్లి, నాగులవరం తదితర గ్రామాలలో 250ఎకరాలకు పైగా పసుపు పంటలను రైతులు సాగు చేస్తున్నారు. పసుపు పంటలో దుంప తెగులు రావడంతో దిగుబడి గోరంత అప్పు కొండంత లా అనిపిస్తున్నాయి. గతంలో పసుపును పండించే రైతులు పసిడిని పండించినంత ఆనందంలో ఉండేవారు. నేడు పసుపును పండిస్తే అప్పులే మిగులుతున్నాయని దీంతో రైతులు నడిరోడ్డున పడాల్సి వస్తుందని పసుపు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పసుపులో దుంప తెగులు రావడంతో సరైన దిగుబడి రాక వచ్చిన అరకొర దిగుబడికి ధర పడిపోవడంతో నేడు పసుపు రైతులు సతమతమవుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోవు రోజులలో పసుపే కనబడకుండాపోయిన ఆశ్చర్యం లేదు.

ఓబుళపతి. పసుపు సాగు రైతు రుద్రవరం : నేను రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని ఎకరాకు 40వేల చొప్పున మునుగుత్త చెల్లించి పసుపు పంటను ఒక ఎకరాకు లక్ష రూపాయలకు పైగా ఖర్చులు చేసి సాగు చేశాను. పసుపులో తెగులు రావడంతో పసుపు పంట నాశనమైంది. నేడు ప్రభుత్వం భూమి మందులను విపరీతంగా పెంచింది. అప్పులు చేసి పసుపు పంటను సాగు చేశాను. అర కొరగా దిగుబడి వచ్చింది. వచ్చిన పసుపును కొనేందుకు ఒక్కరు కూడా ముందుకు రాలేదు. ప్రభుత్వము అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించింది. పసుపు రైతులను మరిచిపోయింది. పసుపు పంటలో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

క్షయవ్యాధి పై అవగాహన

విశాలాంధ్ర - పాములపాడు : మండలం పరిధిలోని ఇస్కాల గ్రామంలోని ప్రాథమికొన్నత పాఠశాల నందు విద్యార్థులకు పాముల పాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆధ్వర్యంలో క్షయవ్యాధ పై అవగాహన సదస్సు నిర్వహించారు అవగాహన సదస్సుకు ఆత్మకూరు టీబీ యూనిట్ సూపర్వైజర్ చెరుకు రవికుమార్ పాల్గొని మాట్లాడుతూ క్షయవ్యాధి లక్షణాలు వివరించారు, 15 రోజులు మించి దగ్గు,జ్వరము,ఆకలి మందగించడం, బరువు తగ్గుతున్న క్షయవ్యాధిగా అనుమానించి గళ్ళ, ఛాతి ఎక్స్-రే పరీక్షలు చేయించు కోవాలని సచించారు, ఆర్.టి.పి.సి.ఆర్ లో గళ్ళ పరీక్ష ద్వార తొలి దశలోనే వ్యాధిని గుర్తించ వచ్చు అన్నారు, ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో క్షయవ్యాధి కి ఉచితంగా మందులు ఇస్తారని తెలిపారు,విద్యార్థులు పౌష్టికాహారం, శారీరక శుభ్రత,పరిసరాల శుభ్రత, వ్యాయామం శ్రద్ధవహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వేదవతి, యం.ఎల్.హెచ్. పి. సింధూర, హెల్త్ అసిస్టెంట్ డి.మరియమ్మ, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

విశాలాంధ్ర - నందికొట్కూరు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇంచార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో తన స్వగృహం నందు మండల కన్వీనర్లు, క్లస్టర్ కోఆర్డినేటర్స్, యూనిట్ ఇన్చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి పట్టభద్రుల ఓటర్లను వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరిని కలిసి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుండం రమణారెడ్డి, మిడుతూరు మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి, గిరీష్ రెడ్డి, షకీల్ అహ్మద్, కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి, మద్దిలేటి మండల కన్వీనర్లు, క్లస్టర్ కోఆర్డినేటర్లు, యూనిట్ ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - చాగలమర్రి: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి కోరారు. నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు బుధవారం ఆయన టీడీపీ నాయకులతో కలిసి మండలంలోని రాంపల్లి, పెద్ద బోధనం ,చిన్న బోధనం, మద్దూరు, నగళ్ళపాడు గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఐటీడీపీ ఉపాధ్యక్షురాలు శజ్జారెడ్డి, నాయకులు లక్ష్మీరెడ్డి,శివారెడ్డి, కుమార్ ఓబులేసు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర- ఉయ్యాలవాడ: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానానికి తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేస్తున్న భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మండల టీడీపీ కన్వీనర్ బోరెడ్డి రాజశేఖర్ రెడ్డి, కూడాల నారాయణరెడ్డి, పేరెడ్డి మోహన్ రెడ్డిలు గ్రాడ్యుయేట్ ఓటర్లను కోరారు. మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు మండలంలోని తుడుమలదిన్నె గ్రామంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత భవిష్యత్తు కోసం పోరాడుతున్న భూమిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎన్నికల్లో ఓటు ఎలా వేయాలో వారికి అవగాహన కల్పించారు.

విశాలాంధ్ర - అవుకు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి కి మద్దతుగా నంద్యాల జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి ఎస్.వెంకటరాముడు నాయక్ ఆధ్వర్యంలో బుధవారం అవుకులో ప్రచార నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బనగానపల్లి మాజీ శాసనసభ్యుడు బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశాల మేరకు అవుకు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, సచివాలయాలలో, ప్రభుత్వ కార్యాలయాలలో ప్రచారం నిర్వహించామని తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయవలసిందిగా కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిక్కన్న, జయ శివుడు,స్వాత్రి రాజు, భాస్కర్,దేవేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత పిల్లలకు స్కాలర్స్ స్కూల్ చేయూత

విశాలాంధ్ర- నందికొట్కూరు : అంగన్వాడీ కేంద్రంలోని రక్తహీనత కలిగిన చిన్నారులకు తన వంతుగా చేయూతనిచ్చేందుకు నందికొట్కూరు పట్టణంలోని స్కాలర్స్ స్కూల్ కరస్పాండెంట్ కాశ్వారి శివప్రసాద్ ముందుకు వచ్చి బుధవారం పట్టణంలోని 27వ అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించడం జరిగింది. రక్తహీనత కలిగిన పిల్లల వివరాలు తెలుసుకొని తన సొంత ఖర్చులతో వారికి మంచి పౌష్టిక ఆహారం రాగిపిండి, పెసలు, అలుసందలు, చిక్కీలు, అరటి పండ్లు కేంద్ర నిర్వాహకులకు అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. అక్కడే ఉన్న తల్లులకు చిన్నారులకు ప్రభుత్వం ఇస్తున్న పౌష్టికాహారం వారికి సక్రమంగా అందించాలని, గర్భవతులు కూడ మంచి ఆహారం తీసుకోవాలని తమ వంతు సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఆశీర్వాదమ్మ, మహిళా పోలీసు భవితరోషన్, అంగన్వాడీ కార్యకర్త జి.పుష్పలత, ఆయా. చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

హాస్పిటల్‌లో కీళ్ల మార్పిడి అందుబాటులో

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల సెవెన్ హిల్స్ హాస్పిటల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించడానికి ఆర్థోపెడిక్ విభాగంలో కీళ్ల మార్పిడి చికిత్సలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సెవెన్ హిల్స్ ఆసుపత్రి యజమాని మారుతీ కుమార్ పేర్కొన్నారు. ఆసుపత్రి 8వ వార్షికోత్సవం సందర్భంగా ఆర్థోపెడిక్ విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మారుతీకుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలో గత ఏడేళ్లుగా జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, చెవి,ముక్కు విభాగాల్లో వైద్యసేవలు అందించామన్నారు. పట్టణ, గ్రామీణప్రాంతవాసులకు మెరుగైన వైద్యసేవలు అందించామన్నారు. గతంలో హైద్రాబాదు,చెన్నై నగరాలకు వెళ్లి కీళ్ల మార్పిడి చూసుకునేవారని,ఇకపై అంత దూరం వెళ్లకుండా మా ఆసుపత్రిలోనే ఈ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఆర్థోపెడిక్ సూపర్ స్పెషాలిటీ వైద్యులు కిరణ్ కుమార్ కీళ్ల వాతం, కీళ్ల మార్పిడి తదితర ఆర్థోపెడిక్ సేవలు అందిస్తామని, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, ఫీజురియంబర్స్ మెంట్ చేయడానికి 25 కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆర్థోపెడిక్ వైద్యసేవలు పట్టణ, గ్రామీణ ప్రాంతవాసులు ఉపయోగించుకోవాలని కోరారు.

వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : వైకాపా బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలోని వైఎస్ఆర్సిపి కార్యాలయం నందు మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డితో కలిసి ఆయా గ్రామ నాయకులకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి బలపరిచిన పశ్చిమ రాయలసీమ పట్టపద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి లకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు అభివృద్ధి పనులను చేపడుతున్నదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంతోపాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు ఎస్ వి నారాయణ రెడ్డి ఎర్రగుడి వెంకటేశ్వర రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వెంకటసుబ్బయ్య కుమార్ జగన్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించండి

విశాలాంధ్ర - వెలుగోడు : పట్టబద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజుకి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని వెలుగోడు పట్టణంలో సిపి నగర్, ద్వారకా నగర్, అరుగుల దగ్గర, తెలుగు గంగ కాలనీలో ప్రజాసంఘాల నాయకులు కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామదాసు,అవాజ్ జిల్లా నాయకులు మహమ్మద్ రఫీ, బీసీ సంఘం నాయకులు రఘు రాముడు ఇంటింట ప్రచారం నిర్వహించారు. డాక్టర్ పోతుల నాగరాజు బ్యాలెట్ నమూనాలోని వరుస నెంబర్ 27లో నాగరాజు ఫోటోకు ప్రక్కన (1)సంఖ్య వేసి, వేయించి వెలుగోడు పట్టభద్రులు, ఉపాధ్యాయులు,మేధావులు,కార్మికులు, కర్షకులు, ఉద్యోగస్తులు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వారు అన్నారు.

ఆశయానికి ముందడుగు వేద్దాం

విశాలాంధ్ర - పగిద్యాల : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిందని ఈ వ్యవస్థ ద్వారా అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే జగనన్న ఆశయానికి ముందడుగు వేసినట్లు ఉంటుందని పగిద్యాల మండల పరిషత్ అధ్యక్షురాలు మండ్ల మల్లేశ్వరి తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన పగిద్యాలలోని స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో మండల సర్వసభ సమావేశం నిర్వహించారు . ఈ సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకోసారి జరిగే మండల స్థాయి సమావేశానికి మండల స్థాయి అధికారులు గైహాజరయితే గ్రామీణ ప్రాంతాల్లోని నెలకొన్న సమస్యలను ఎలా పరిష్కరించాలంటూ సమావేశానికి రాని వారిపై వెంటనే కలెక్టర్ ఫిర్యాదు చేయాలని ఎంపీడీవో కు సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం వైద్యాధికారులను నియమించిన విధంగానే, పశువులకు సైతం సంచార జాతుల మొబైల్ వాహనాన్ని పెట్టి వాటి రక్షణకు పాటుపడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వేసవికాలం మొదలైన తరుణంలో గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి లేకుండా బోరు మరమ్మత్తులు చేయించి ప్రత్యేక చొరవ తీసుకోవాలని సర్పంచ్ ఎంపీటీసీలు, అధికారులకు సూచిం చారు. మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించి ముందుకు వెళ్లాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయాన్ని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని హెల్త్ క్లీనిక్ మరియు ఆర్.బి.కె కేంద్రాలను ఎంపీటీసీ,సర్పంచ్ ,ఎంపీపీ ,జడ్పిటిసిలు తనిఖీ చేసి ఏమైనా తప్పులు ఉంటే రికార్డుల్లో నమోదు చేయాలని ప్రజా ప్రతినిధులకు ఎంపీడీవో సూచించారు ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యురాలు పుల్యాల దివ్య, మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి, తహసీల్దార్ భారతి, ఈ ఓ ఆర్ డి పుల్లయ్య ,వెలుగు ఏపిఎం శ్రీనివాసులు, పశుసంవర్ధక శాఖ అధికారి సుమన్, మండల విద్యాశాఖ అధికారి సుభాన్, పంచాయతీరాజ్ అధికారి, పగిద్యాల, ప్రాతకోట వైద్యాధికారులు, ఐసీడీఎస్, గృహ నిర్మాణ శాఖ అధికారులతో పాటు ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

నూతన ఆలయ నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మానవజాతికి పవిత్ర గ్రంథం అయిన రామాయణాన్ని అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వాల్మీకుల ఆధ్వర్యంలో చేపడుతున్న వాల్మీకి మహర్షి నూతన ఆలయనిర్మాణ భూమి పూజలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వేద పండితులు నిర్మాణ స్థలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఉన్నతమైన మానవతా విలువలను రామాయణం మనకు అడుగడుగున బోధిస్తున్నదని తెలిపారు. వాల్మీకి రామాయణాన్ని అనుసరించి ప్రతి ఒక్కరు గొప్పగా ఎదగాలని ధర్మ మార్గాన్ని అనుసరించి ప్రతి ఒక్కరూ వాల్మీకిబోధనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మండల కేంద్రంలో వాల్మీకి మహర్షి ఆలయాన్ని చేపట్టడం అభినందనమన్నారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా వాల్మీకి ఐక్య పోరాట సమితి అధ్యక్షుడు గోవిందు నాయుడు, మండల కన్వీనర్ అంబటి గురువిరెడ్డి, పేరం నందకిషోర్‌రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, మండల వాల్మీకి సంఘం నాయకులు నర్సింహులు, మాజీ ఎంపీపీ రామాంజనేయులు, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్, బెలుం హుస్సేనయ్య, వెంకటేష్, హుస్సేన్ నాయుడు, చెక్క వెంకట్ రాముడు,తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర - అవుకు : మండలంలోని చనుగొండ్ల నుండి సుంకేసుల మీదుగా ఆకుముల వరకు బీటీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి పంచాయతీరాజ్ ఏఈ మహబూబ్ బాషా బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎంసీ నిధుల ద్వారా ఒక కోటి 78లక్షల రూపాయలతో చనుగొండ్ల నుండి సుంకేసుల మీదుగా ఆకుమల్ల వరకు ఏడు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ బీటీ రోడ్డు నిర్మించడం వలన సుంకేసుల ప్రజలకు చనుగొండ్ల మీద రావడానికి గాని ఆకుమల్ల మీద రావడానికి గాని ప్రయాణం సులువుగా ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న చనుగొండ్ల ఆకుమల్ల రోడ్డు నిర్మాణం చేపట్టడంతో చనుగొండ్ల సుంకేసుల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మేలు జాతి పశువులతో ఆర్థికాభివృద్ధి

విశాలాంధ్ర- పాములపాడు : పెయ్య దూడలను శాస్త్రీయ పద్ధతిలో పోషించినట్లయితే మంచి పాడి పశువులుగా అభివృద్ధి చేసుకోవచ్చని డిస్ట్రిక్ట్ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాజశేఖర్ అన్నారు,మండలంలోని వేంపేట పశువైద్య కేంద్ర పరిధిలో ఎర్రగూడూరు గ్రామంలో పేయ్య దూడల ప్రదర్శన పోటీలు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు,ఈ ప్రదర్శన పోటీలకు 60 పెయ్య దూడలతో 40 మంది పాడి రైతులు హాజరయ్యారు.ప్రథమ బహుమతి గోపాల్ నాయక్,ద్వితీయ బహుమతి బి వెంకటయ్య తృతీయ బహుమతి పి ఎల్లప్ప లకు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా వెలుగోడు ఏడి డాక్టర్ ధనంజయుడు మాట్లాడుతూ ఈ మార్చినెలలో నాలుగు నెలల వయస్సు దాటిన అన్ని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని, 1962 అంబులెన్స్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు,వేంపేంట పశువైద్యాధికారి డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ దూడల్లో మరణాలు నివారించేందుకు నట్టల నివారణ మందులు మరియు వ్యాక్సినేషన్ తప్పనిసరి అని రైతులకు అవగాహన కల్పించారు,ఈ కార్యక్రమంలో వి ఎల్ ఓ తిరుపతమ్మ , ఏ హెచ్ ఏ ప్రసన్న,మనీష్ సిబ్బంది మున్వర్ బాషా ,సుమిత్ర, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎస్సై శంకరనాయక్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-బేతంచెర్ల రూరల్ : మండల ఎస్సైగా శంకర నాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఎస్సై మాట్లాడుతూ సీఐ ప్రియతమ్ రెడ్డి ఆదేశానుసారం మండలంలో గుట్కా,పేకాట,నాటు సారా, అక్రమ మద్యం,దొంగతనాలు, సైబర్ నేరాలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజా సంరక్షణనే తమ ధ్యేయమని ఎస్సై తెలిపారు.అనంతరం సీఐ ప్రియతమ్ రెడ్డి,పోలీస్ సిబ్బంది ఎస్సైకు శుభాకాంక్షలు తెలియజేశారు.

వైభవంగా బ్రహ్మోత్సవం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : అహోబిలం బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి పలు వాహనాలపై విహరిస్తూ భక్తులను కనువిందు చేస్తున్నారు. ఎగువ అహోబిలంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా 5వ రోజు బుధవారం శేష వాహనంపై జ్వాలా నరసింహ స్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసిన అనంతరం శేష వాహనంపై మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.మధ్యాహ్నం జ్వాల నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు అర్చకులు లక్ష్మీనరసింహాచార్యులు వేదమంత్రాల నడుమ అభిషేకం నిర్వహించారు. రాత్రి జ్వాల నరసింహస్వామి విశేష అలంకరణలో చంద్రప్రభ వాహనంపై కొలువుతీరి భక్తులకు దర్శనమిచ్చారు.

దిగువ అహోబిలంలో : బుధవారం ఉదయం ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవార్లు యోగ నృసింహ గారుడ విమానంపై కొలువు దీరి భక్తులకు దర్శనమిచ్చారు. అహోబిల మఠం పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహదేసికన్ సమక్షంలో ప్రధాన అర్చకులు వేణుగోపాలచార్యులు, అర్చక బృందం ఉత్సవ మూర్తులు ప్రహ్లాద వరద స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం అహోబిలం మాడవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో అహోబిలం మఠం చేరుకున్న ప్రహ్లాద వరద స్వామి, అమ్మవార్లకు పీఠాధిపతి స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తి ప్రహ్లాద వరద స్వామినీ అలంకరించి హనుమంత వాహనంపై కొలువుంచి ప్రత్యేక పూజలు అనంతరం అహోబిలం మాడ వీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. గరుడాద్రి పర్వతాన కొలువుతీరిన అహోబిలేసుడు రాముని రూపంలో కారంజ నరసింహస్వామి గా ఆంజనేయ స్వామికి దర్శనమిచ్చారు. దీనికి సూచికగా హనుమంతుడి పై జ్వాల నరసింహ స్వామి విహరిస్తూ భక్తులను అనుగ్రహిస్తారని అర్చకులు తెలిపారు.

ఆలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - బనగానపల్లి : బనగానపల్లి మండలం యాగంటి పల్లె గ్రామంలో టీటీడీ వాణి ట్రస్ట్ 10 లక్షల రూపాయల ఆర్థిక సహకారంతో నూతనంగా నిర్మించిన అభయ ఆంజనేయ స్వామి ఆలయాన్ని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా టీటీడీ ఆధ్వర్యంలో దాదాపుగా 900 ఆలయాలు నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. అలాగే గ్రామంలో అందరు కలిసిమెలిసి గ్రామీణ అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, యాగంటి ఆలయ మాజీ చైర్మన్ దొనపాటి యాగంటి రెడ్డి, సర్పంచ్ బండి వరలక్ష్మి, బండి బ్రహ్మానంద రెడ్డి, లక్ష్మీదేవి, నంద్యాల జిల్లా కన్వీనర్ మాధవరెడ్డి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కదిరిలో రిపోర్టర్ల పై బనాయించిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో సీఐ ఇంటి వద్ద టీడీపీ శ్రేణులు చేసిన ఆందోళన కార్యక్రమాన్ని చిత్రీకరి స్తున్న మీడియా ప్రతినిధుల సెల్ ఫోన్లను పోలీసులు లాక్కొని దౌర్జన్యం చేడమే కాకుండా వారిపై అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమని వెంటనే అక్రమకేసులు ఎత్తివేసి, సీఐపై చర్యలు తీసుకోవాలని ఏపీయూ డబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఏపీయూడబ్ల్యూ జే జిల్లా అద్యక్ష కార్యదర్శులు ఈ ఎన్‌రాజు, శ్రీనివాసులుగౌడ్, ఐజేయూ నాయకులు కె నాగరాజు, కొండప్ప, నాయకులు దస్తగిరి, అంజి, అవినాష్, శివ, ఉసేన్ తదితరులు డీఆర్‌ఓను కలసి వినతిపత్రం అందచేశారు.వారు పాత్రికేయు లతో మాట్లాడుతూ సీఐ రిపోర్టర్లను నానా దుర్భాషలాడుతూ దాడి చేయాలని పోలీసులకు ఉసిగొల్పాడం దారుణ మన్నారు. రిపోర్టర్ షబ్బీర్ సెల్ ఫోన్ లాక్కున్నారు. ఘటనలో రిపోర్టర్ల పై కదిరి సీఐ తమ్మిశెట్టి మధు రివర్స్ కేసులు పెట్టారు. స్థానిక రిపోర్టర్లు షబ్బీర్, సోమశేఖర్, జాన్, బాబ్జాన్ లపై పలు సెక్షన్లు కింద కేసు నమోదు చేశారు. ఘటనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలపారు. ఇప్పటివరకు ఘటనకు కారణమైన కదిరి సీఐ మధు పై ఎటువంటి చర్యలు తీసుకోకపోగా విధి నిర్వహణలో భాగంగా న్యూస్ కవర్ చేయదానికి వెళ్లిన రిపోర్టర్ల పై కేసులు పెట్టడాన్ని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) తీవ్రంగా ఖండిస్తోందన్నారు.. కదిరి ఘటన రిపోర్టర్ల పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.రిపోర్టర్లపై దాడులకు పాల్పడిన పోలీసుల పైన, అందుకు కారణమైన సీఐ పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

విశాలాంధ్ర - కోసిగి : శ్రీ సత్య సాయి జిల్లా కదిరి పట్టణంలో టిడిపి నాయకులు చేస్తున్న ఆందోళన కార్యక్రమాన్ని చిత్రీకరిస్తున్న మీడియా జర్నలిస్టుల సెల్ ఫోన్లు లాక్కొని జర్నలిస్టులపై దాడు లకు పాల్పడి, జర్నలిస్టు లపైనే కేసులు నమోదు చేసిన కదిరి సీఐని సస్పెండ్ చేసి, జర్నలిస్టులపై కేసులు ఎత్తివేయాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా సహాయ కార్యదర్శి హను మేష్, మండల అధ్యక్షులు షబ్బీర్,గౌరవ అధ్యక్షులు గద్దం ఈరన్న, తాలూకా ఉపాధ్యక్షులు శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర,జిల్లా కమిటీ పిలుపుమేరకు బుధవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు మండల కమిటీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీల తో జర్నలిస్టులు నిరసన తెలిపారు. ఏపీడబ్ల్యూజే మండల ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్, ఉపాధ్యక్షులు కరెప్ప, సతీష్,ప్రవీణ్, జీవన్,లక్ష్మన్న,యూసుఫ్,మహ్మద్,రంగస్వామి పాల్గొన్నారు.

అక్రమంగా చేపలు పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - ఆస్పరి : మండల పరిధిలోని వెంగలాయదొడ్డి చెరువులో అక్రమంగా చేపలను పడుతున్న అక్రమార్కుల పై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు నాగేంద్రయ్య, మండల కార్యదర్శి విరుపాక్షి లు డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ లక్ష్మన్న కు అలాగే పోలీస్ స్టేషన్ లో ఎస్సై వరప్రసాద్ లకు వేరువేరుగా వినతి పత్రాలను అంద జేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వెంగళయదొడ్డి చెరువులోకి స్వచ్ఛందంగా వర్షపు నీటిలో కొట్టుకు వచ్చిన చేపల పై కొంతమంది అక్రమార్కులు చెరువులో చేపలను పడుతూ విక్రయాలు జరుపుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడమే కాకుండా ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న అక్రమ చేపల వేటగాళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలో చెరువు ఆయకట్టు రైతులుతో కలిసి సిపిఐ బృందం వెంగళాయదొడ్డి చెరువును పరిశీలించి, అక్రమంగా చేపలు పడుతున్న వేటగాళ్ల భరతం పడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు బ్రహ్మయ్య, పట్టణ కార్యదర్శి కృష్ణమూర్తి, ఉరుకుందప్ప, రంగన్న, బజారి, మల్లికార్జున, వీరన్న, మల్లన్న, ఏఐవైఎఫ్ నాయకులు రామాంజనేయులు, చదువుల రామయ్య, అంజినయ్య, హరి పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రావడం ఖాయం

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు టౌన్ : ఎన్నికలు ఎప్పుడు వచ్చినా రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. బుధ వారం ఎమ్మిగనూరు పట్టణం ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనలకు, "యువ గళం" పేరుతో నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుండి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ముఖ్యమంత్రి జగన్ అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. అరాచకమే వైసీపీ రాజ్యాంగంగా పాలన సాగిస్తోందన్నారు. రాష్ట్రంలో అరాచక పాలనకు "గన్నవరం" ఘటన అద్దం పడుతోందని మండిపడ్డారు. తాము ఎందరో ముఖ్యమంత్రులను చూశామని ఇలాంటి రాక్షసత్వం కలిగిన ముఖ్యమంత్రిని చూడలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్ మద్య నిషేధం చేస్తానని హామీ ఇచ్చి, నమ్మించి మద్యం ఆదాయాన్ని 15 ఏళ్లు పాటు బ్యాంకులకు తాకట్టు పెట్టి, 25 వేల కోట్ల రూపాయలు అప్పులు తెచ్చి మద్యం రేట్లు మూడు రెట్లు పెంచి "పేదల సంపాదన" ను జలగల్లాగా తాగేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పక్కా గృహ నిర్మాణాల బకాయిలను వన్ టైం సెటిల్మెంట్ పేరుతో పేదల నుండి వసూళ్ళు చేసి 4500 కోట్లు దోపిడీ చేశారని తెలిపారు. బస్సు చార్జీలు రెండుసార్లు, విద్యుత్ చార్జీలు ఏడుసార్లు పెంచి ప్రజల నడ్డి విరచిన ఘనత జగన్ దేన న్నారు. జగన్ సర్కారు రాష్ట్రంలో నీళ్లు,నిధులు, నియామకాలకు మంగళం పాడి దోచుకోవడం,దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని, వైసీపీ నేతలకు "ధనయజ్ఞం" తప్ప "జలయజ్ఞం" తెలియదని ఎద్దేవ చేశారు. ఒక్క ఛాన్స్ పేరుతో జగన్ కు అధికారం కట్ట పెట్టినందుకు ప్రజలు పశ్చాతాపం పడుతున్నారని, వై సీపీ అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆదోని నియోజక వర్గం టిడిపి మాజీ ఇంచార్జీ గుడిసె కృష్ణమ్మ, టిడిపి నాయకులు ఆరవీటి సుధాకర్ శెట్టి, గోనెగండ్ల మాజీ ఎంపీపీ కేవీ కృష్ణారెడ్డి, కదిరికోట ఆదె న్న, పాల్గొన్నారు.

ఘనంగా గురు సుబ్బారుడా రథోత్సవం

విశాలాంధ్ర-కోసిగి : స్థానిక రంగప్ప గట్టు వద్ద వెలసిన గురు సుబ్బారుడా రథోత్సవం బుధవారం అశేష జనవాహిని మధ్య, కనుల పండుగ జరిగింది. ఆలయ కార్యదర్శులు మఠం చంద్రప్ప, బొంబాయి దయా, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం నుంచి ఫల,పుష్ప అలంకరణ వంటి ప్రత్యేకపూజలు చేశారు.60వ రథోత్సవాన్ని పురస్కరించుకొని స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో గురుపూజ మరియు అన్నదాన కార్యక్రమం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై రాజారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

కొలతల ప్రకారం పని కచ్చితంగా చేయాలి

విశాలాంధ్ర - సి.బెళగల్ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనికి వెళ్లే ప్రతి ఒక్కరూ ఉదయం ఆరున్నర గంటలకల్లా పని ప్రదేశంలో ఉండాలి అని ఏడిఏ అల్లిపీరా అన్నారు. బుధవారం మండల కేంద్రమైన సి.బెళగల్ లోని చెక్ డ్యామ్ లో జరుగుతున్నటువంటి పూడికతీత పనులు ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన ఉపాధి కూలీల మస్టర్లను మరియు హాజరులను ఆయన పరిశీలించి ఎంతమంది కూలీలు పనికి వచ్చారని ఫీల్డ్ అసిస్టెంట్ అని అడిగి తెలుసుకున్నారు. బుధవారం ఉపాధి హామీ పనులకు 108 మంది కూలీలు రావడం జరిగిందని ఫీల్డ్ అసిస్టెంట్లు చెప్పారు. అనంతరం ఏ డి ఏ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారము ప్రతి ఒక్కరు పనిని పూర్తి చేయాలని అలా మీకు కొలతల ప్రకారం అప్పగించిన పనిని పూర్తి చేస్తేనే 257 రూపాయలు కూలీ పడుతుందనిఅలాగే ఎండాకాలం తీవ్రమవు తున్నందున ఉదయం ఆరున్నర గంటలకల్లా పని ప్రదేశానికి వెళ్లి ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనిని పూర్తిచేసుకుని 11గంటల కల్లా ఇల్లు చేరుకోవాలని ఏడిఈ అల్లిపీరా ఉపాధి కూలీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ వెంట ఈసీ పృథ్వీరాజ్ ఎంపీటీసీ వితేందర్ రెడ్డి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు మరియు ఉపాధి మేటీలు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల తనిఖీ

విశాలాంధ్ర-కోసిగి : గ్రామంలో ఉన్న ఇండియన్, హెచ్‌పి, ఈఎస్ఆర్ పెట్రోల్ బంకులను బుధవారం తూనికల కొలతల శాఖ అధికారి వరప్రసాద్, తహశీల్దార్ రుద్ర గౌడ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న మూడు పెట్రోల్ బంకుల్లో త్రాగునీరు, మరుగుదొడ్లు, ఉచిత గాలి, ఫోన్ సౌకర్యం వంటివి లేవని అసంతృప్తితో పాటు అసహనం వ్యక్తం చేశారు. వాహనదారులకు పెట్రోల్ బంకుల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని,వారి నుండి మర్యాద వ్యవహరించాలని నాణ్యమైన పెట్రోల్, డీజిల్ సరఫరా చేయాలన్నారు. అదేవిధంగా కొలతలు,నాణ్యతను పరిశీలించారు. వాహనదారులు ఏమైనా సమస్యలు ఉంటే తమకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీరాములు,సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టండి

విశాలాంధ్ర - ఆదోని : పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికల పోలింగ్ కి సంబంధించిన పోలింగ్ కేంద్రాల్లో పకడ్బం దీగా ఏర్పాట్లు చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆదోని డివిజన్లోని కౌతాళం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాల, కోసిగి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలుర పాఠశాల, మంత్రాలయం మండలం జిల్లా పరిషత్ పాఠశాల, నందవరం మండలం ప్రభుత్వ పాఠశాల నందు ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఆదోని డివిజన్లో ఎమ్మెల్సీ పట్టభద్రులు 19 కేంద్రాలు, ఉపా ధ్యాయ ఎమ్మెల్సీ కేంద్రాలు 09, డివిజన్ మొత్తంగా 28 ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. పోలింగ్ కేంద్రాలలో బారి కెడ్లు, పటిష్ట పోలీసు భద్రత, విద్యుత్, లైటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కోసిగి మండలం జుమ్మలదిన్నె గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ సచివాలయాల సిబ్బందితో సచివాలయ సర్వీసులను పెంచే సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. పిఎంజెవై కార్డులకు సంబంధించి వాలంటీర్లు అందరీ వివరాలు సేకరించి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. కళ్యాణ మస్తుకు సంబంధించిన త్వరితగతిన పూర్తి చేసి, మ్యారేజ్ సర్టిఫికేట్లను బియోండ్ ఎస్ఎల్ఏ వెళ్లకుండా చూడాలన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా రక్తహీనతతో బాధపడుతున్న గర్భవతులకు మెరుగు పరిచేలా ఆరోగ్య కార్యకర్త మరియు సంక్షేమ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కోసిగి మండలం జిల్లా పరిషత్ బాలుర ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి ఉపాధ్యాయులతో సబ్ కలెక్టర్ సమీక్షించారు. పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణులు అయ్యేలా ఉపాధ్యాయులు ప్రణాళిక సిద్ధం చేయాలని, ఉన్నత చదువులకు పదవ తరగతి తొలిమెట్టన్నారు. ఉపాధ్యాయులు నిత్యం విద్యార్థుల ఉన్నతి కోసం కృషి చేస్తూ వారికి మంచి మార్కులు తెప్పించే దిశగా కృషి చేయాలని అన్నారు. చాలా మంది తల్లిదండ్రులు ఎంతో కష్టపడి వారిని చదివిస్తున్నారని వారి తల్లి దండ్రుల కష్టాన్ని విద్యార్థులు గుర్తుపెట్టుకొని ఉన్నత లక్ష్యాలు సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ఏప్రిల్ 3వ తేది నుండి పరీక్షలు ఉన్నందున ప్రతి రోజు రెండు మార్కులు చొప్పున చివరి గ్రేడ్ లో ఉన్న విద్యార్థులు పై గ్రేడ్ లకు వెళ్లేలా ప్రయత్నించాలన్నారు. పదవ తరగతి పాస్ అయిన తరువాత ఎన్నో మార్గాల ద్వారా ఉన్నత చదువులకు అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులకు అవసరమైనవన్ని ప్రభుత్వం అందించడంతో పాటు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. పదవ తరగతి అనేది ఉన్నత విద్యకు తొలి మెట్టు లాంటిదని విద్యార్థులు గుర్తు పెట్టుకోవాలన్నారు. ఉపాధ్యాయులు బడిలోని పిల్లలను తమ పిల్లలుగా భావించి వారు ఉన్నత చదువులు చదివేలా వారిని ప్రోత్సహించాలని అన్నారు. పదవ తరగతి విద్యార్థులు ఈ ఒక్క నెలకు ప్రణాళిక రూపొందించుకొని చదవాలన్నారు. అదే విధంగా సి, డి గ్రేడ్‌లలో ఉన్న విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ ను అందించడంతో పాటు గ్రూపుల వారీగా విద్యార్థులను విభజించుకొని వారు తప్పకుండా ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

అయాచారం చేయించుకోవడం సాంప్రదాయం



విశాలాంధ్ర - పత్తికొండ : అయాచారం చేసుకోవడం జంగము కులస్తుల సంప్రదాయమని జంగమ సంక్షేమ సంఘం తాలూకా అధ్యక్షులు మంజునాథ్ స్వామి అన్నారు. బుధవారం స్థానిక వీరభద్ర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన జంగమ కులస్తుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యావత్ జంగమ సేవా కులస్తులు అయాచారం చేయించుకోవడం తరతరాలుగా వస్తున్న ఆచార సాంప్రదాయమన్నారు. ఆది గురువు రేణుక చార్య జయంతి పురస్కరించుకుని ఆదోని డివిజన్ జంగమ సమాజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 5న ఆదోనిలోని శ్రీ పేట వీరభద్ర స్వామి ఆలయంలో అయాచార కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి వీర శైవులు, భక్తాదులు విరివిగా పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జంగమ సంక్షేమ సభ్యులు వీర శేఖర్ స్వామి, జగదీష్ స్వామి, బసవరాజు స్వామి పాల్గొన్నారు.

సైన్స్ దినోత్సవాన్ని జరుపుకోవడం గర్వకారణం



విశాలాంధ్ర - ఆదోని రూరల్ : పట్టణంలోని శ్రీచైతన్య-1 పాఠశాలలో విద్యార్థులు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్క రించుకొని నమూనాలను తయారు చేశారు. విద్యార్థులు తయారుచేసిన సైన్స్ నమూనాలను పరిశీలించేందుకు ముఖ్య అతిథులుగా డాక్టర్ సూరి దాస్ బుధవారం పాల్గొని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివి.రామన్ జన్మదిన వేడుక రోజు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకోవడం గర్వకారణమన్నారు. ప్రతి వ్యక్తికి నిత్యజీవితంలో సైన్స్ కూడా ప్రధానమైనదని వ్యాఖ్యానించారు. నేటి విద్యార్థులు భావితరాలకు ఉపయోగపడే విధంగా విజ్ఞాన శాస్త్రం పై ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని సూచించారు. సైన్స్ విధివిధానాలపై పలు విషయాలను అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏజీఎం సురేష్,ఆర్ఐ రంగారెడ్డి,అకాడమిక్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు,ప్రిన్సిపాల్ గౌసియా ఖానమ్,అకాడమిక్ డీన్ వీరారెడ్డి, ప్రైమరీ ఇన్చార్జ్ లలిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియంతగా వ్యవహరిస్తున్న జగన్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తూ ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతూ, హత్యలు, దౌర్జన్యాలు, దాడులు చేస్తున్నారని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో కలసి పాత్రికేయులతో మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏ వర్గం కూడా సంతృప్తిగా లేరన్నారు. కులాల మధ్య మతాల మధ్య చిచ్చుపెట్టి ప్రజలను మోసం చేస్తున్నాడన్నారు. రాష్ట్రంలో అరాచకపాలనకు స్వస్తీ చెప్పాలని ప్రతి ఒక్కరూ చూస్తున్నా రని జరగబోయో ఎమ్మెల్సీ ఎన్నికలలో టీడీపీ అభ్యర్థులకు ఓటు వేసి జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని కోరారు. పోటీలో ఉన్న అభ్యర్థులను బయపెట్టి, కలెక్టర్, ఎస్పీ, పోలీసు, రెవిన్యూ అధికారులను ఉపయోగించుకుని వన్‌సైడ్ చేసుకోవాలని ప్రయత్నాలను అడ్డుకోవాలన్నారు. ఎన్నికల ముందు ఉద్యోగుల సీపీఎస్ రద్దు చేస్తానని చెప్పి నేడు ఉద్యోగులు ప్రశ్నిస్తే వారిపై కేసులు పెట్టడమే కాకుండా కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతున్నాడన్నారు. 15వ తేది వచ్చినా జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. పోలీసులు వ్యవస్థను ఉపయో గించుకుని టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. 10లక్షల కోట్లు అప్పులు చేశారని, ఉద్యోగాలు భర్తీ చేయలేదు, జాబ్ క్యాలెండర్ లేదు, మెగాడీఎస్సీ ఏమైందని ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వం కిసాన్ పథకం నిధులు అకౌంట్‌లో వేస్తే తాను వేసినట్లుగా ప్రజలను మభ్యపెడుతూ కోట్ల రూపాయలు ప్రకటనల పేరుతో తమ పత్రికకు దోచి పెడుతున్నారని ఆరోపించారు. బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్‌లలో నిధులు లేవన్నారు. శాసన మండలి ఎన్నికల్లో టీడీపీ బలపరచిన భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. సోమిశెట్టి మాట్లాడుతూ ప్రభుత్వంపై పెద్దఎత్తున వ్యతి రేఖత ఉందని ఉద్యోగులు, యువజనులు, తమ ఓటును టీడీపీకి వేసి గెలిపించాలని కోరామని మంచి స్పందన ఉందన్నారు. టీడీపీ నాయకులు సోమిశెట్టి నవీన్, నాగేంద్రకుమార్, మహేష్‌గౌడ్, రవికుమార్, హనుమంతరాయ చౌదరి, సత్రం రామకృష్ణ, తిరుపాల్‌బాబు, జేమ్స్ బాబూరావు, ఉన్నారు.

సచివాలయ ఉద్యోగులు సక్రమంగా పని చేయాలి

విశాలాంధ్ర- సి.బెళగల్ : సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు సచివాలయాలు ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా పనిచేయాలని సచివాలయ ఉద్యోగులను మండల అభివృద్ధి అధికారి ఏసీ రాముడు ఆదేశించారు. బుధవారం ప్రతి నెల మొదటి వారంలో చేపట్టే మండల స్థాయి అధికారులు అందరూ వారికి కేటాయించినటువంటి ఆయా గ్రామాల్లోని సచివాలయాల యందు సమావేశమై అక్కడ ఉన్నటువంటి సచివాలయ సిబ్బంది,వాలంటరీల తోనూ సమావేశం నిర్వహించే పనిలో భాగంగా బుధవారం మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో సచివాలయ ఉద్యోగులతో నిర్వహించి నటువంటి సమీక్షా సమావేశంలో ఎంపీడీవో ఏసీ రాముడు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు సర్వే చేయవలసి నటువంటి సస్టైనబుల్ డెవలప్మెంట్ లక్ష్యాలు, పురోగతి, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డుల విషయంలపై ఆయన సచివాలయ సిబ్బంది ,వాలంటరీలతో చర్చించారు. అలాగే సచివాలయాలకు సర్వీసెస్ ఇవ్వాల్సి న విషయమై సిబ్బంది,వాలంటరీలకు ఆదేశాలిస్తూ సచివాలయాలు ప్రజలందరికీ ఉపయోగపడేలా సిబ్బంది పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు డిజిటల్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు మరియు పంచాయతీ కార్యదర్శులు తదితర సచివాలయాల సిబ్బంది వాలంటరీలు పాల్గొన్నారు.

వైసిపి పాలనలోనే సంక్షేమం సాధ్యం

విశాలాంధ్ర - గూడూరు : వైసిపి పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుం దని పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని నగర పంచాయతీ చైర్మన్ జూలపాల వెంకటేశ్వర్లు వైస్ చైర్మన్ పిఎస్అస్లాం కౌన్సిలర్ ఖలీల్ తెలిపారు. గూడూరు మండలంలోని 19వ వార్డులో బుధవారం పింఛన్ లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యులుగా నగర పంచాయతీ చైర్మన్, వైస్ చైర్మన్లు హాజరయ్యారు. వారి చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్లను అందజే శారు. 19వ వార్డు కౌన్సిలర్ ఖలీల్ మాట్లాడుతూ తమ వార్డులోని అర్హుల కు పింఛన్లను నేరుగా అందించడం సంతోషంగా ఉందని పెన్షన్ అందని లబ్ధిదారులు ఏవైనా ఫిర్యాదులు ఉంటే తమ దృష్టికి తీసుకొని వచ్చి పరిష్కరించు కోవాలని తెలిపారు. రెండవ వైస్ చైర్మన్ లక్ష్మణ్ ,కౌన్సిలర్లు నందకిషోర్, సచివాలయం కోఆర్డినేటర్లు నేతలు పాల్గొన్నారు.

నవోదయ విద్యాలయంలో చిరుధాన్యాల ప్రదర్శన

విశాలాంధ్ర- ఎమ్మిగనూరు టౌన్ : జవహర్ నవోదయ విద్యాలయ బనవాసిలో ప్రధాన మంత్రి పోషణ శక్తి నిర్మాణ్ లో భాగంగా చిరు ధాన్యాల ప్రదర్శన ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ కె. సాగరిక గారు మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదాలు చిరుధాన్యాలని, చిరుధాన్యాలు సిరిధాన్యాలు చిన్న చిన్న విత్తనాలతో కూడిన గడ్డి జాతి సమూహానికి చెందిన పంటలే ఈ చిరుధాన్యాలు. మన పూర్వికులు మొట్ట మొదటిగా సాగు చేసిన పంటలు చిరు ధాన్యాలే. ప్రతికూల వాతావరణ పరిస్థులలో కొద్దిపాటి వర్షాలకే పండే పంటలివి. 2023 ఇది అంతర్జాతీయ చిరుధాన్యాల పండగ సంవత్సరం. భారత్ ప్రతిపాదన మేరకు ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ లో రెండు సంవత్సరముల క్రితమే నిర్ణయించింది. 72 దేశాల మద్దతుతో ఈ అంతర్జాతీయ చిరుధాన్యాల పండుగా అమల్లోకి వచ్చింది. ఆరోగ్యపరమైన ప్రయోజనాలకు తోడుగా పర్యావరణ పరిరక్షణ పరంగా కూడా ఇవి మేలైన పంటలు. ఈ ఏడాదంతా చిరుధాన్యాలపై అవగాహన పెంచడం, ఆరోగ్య, పోషకాహార ప్రయోజనాల దృష్ట్యా, వీటి వినియోగం పెంచడానికి, సాగును విస్తృతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ - ప్రిన్సిపాల్, బసవరాజ్, శ్రీనివాస రావు, వెంకటేష్ మీనాచంద్రన్, లైబ్రేరియన్ పద్మ పాల్గొన్నారు.

చట్టసభలలో మాట్లాడే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర - కర్నూలు : చట్టసభల్లో మాట్లేడే పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ఏపీ వ్యవసాయకార్మికసంఘం రాష్ట్రప్రదాన కార్యదర్శి ఆవుల శేఖర్ కోరారు. బుధవారం నగరంలోని బ్యాంకులు స్కూళ్లలో ఎమ్మెల్సీ అభ్యర్థులైన టీచర్ ఎమ్మెల్సీ కత్తి నర్సింహారెడ్డి నిరుద్యోగుల గొంతుకైనా పట్టభద్రుల అభ్యర్థి పోతులనాగరాజు గెలిపించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ మునెప్ప,, సీనియర్ నాయకులు మనోహర్ మాణిక్యం సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డిలతో కలసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులతో మాట్లాడినటువంటి శేఖర్ ఈనాడు బ్యాంకింగ్ రంగం అంత కూడా కుదేలవుతున్న సందర్భంగా ప్రజల పక్షాన బ్యాంకు ఉద్యోగుల పక్షాన టీచర్ల సమస్యల పక్షాన మాట్లాడే ఎమ్మెల్యేలు గానీ ఎమ్మెల్సీలు గాని లేకపోవడం చాలా ప్రమాదకరమన్నారు. ప్రజలందరికీ బ్యాంకింగ్ రంగం గుండెకాయ లాంటిది అలాంటి బ్యాంకింగ్ రంగాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని యోచన చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న జగన్మోహన్ రెడ్డి ఆయన బలపరచిన అభ్యర్థులను ఓడించాలని కోరారు. పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ నగరంలో ఏఐఎస్ఎఫ్, ప్రజానాట్యమండలి, ఏఐటీయూసీ ,ఏఐవైఎఫ్, ప్రజాసంఘాల నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

విశాలాంధ్ర - కర్నూలు లీగల్ : పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ,పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో పిడిఎఫ్ బలపరుస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజులకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం కల్లూరు మండల కేంద్రంలో ఏఐఎస్ఎఫ్,ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ నిరుద్యోగుల సమస్యలపై శాసనసభ, శాసనమండలిలో గళం ఎత్తే నాయకులు కరువయ్యారన్నారు. అధికార పార్టీ నాయకులు ఎన్నికై జగన్మోహన్ రెడ్డిని పొగడడం తప్ప, నిరుద్యోగులు ఉద్యోగులు ఉపాధ్యాయుల సమస్యల మీద మాట్లాడలేని పరిస్థితులు నెలకొన్నయని అన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని పోరాడుతున్న ఉపాధ్యాయులపై ఉక్కు పాదం మోపి వారిపై లాఠీలు చేపించి, అక్రమ కేసులు బనాయించారని అన్నారు. ఉద్యోగస్తులు ఉపాధ్యాయులు వారి సమస్యలపై విన్నవించుకోవాలన్నా నిర్బంధాలకు గురిచేసి, అనుమతులు లేవని చేయడం జరిగిందన్నారు. గతంలో అధికార పార్టీ ఎమ్మెల్సీలు గెలిచినప్పటికి కూడా కేవలం వారు తమ వ్యక్తిగత కార్యకలాపాలు మాత్రమే నిర్వహించి, సమస్యలను గాలికి వదిలేశారని అన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ పట్టభద్రుల సమస్యలపై కేవలం పిడిఎఫ్ అభ్యర్థులు మాత్రమే గళమెత్తుతారని అన్నారు. కావున పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ,పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజులకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి వేయించి గెలిపించి, చట్టసభలకు పంపించడం ద్వారా వారి సమస్యలను చట్టసభల్లో గళమెత్తేందుకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఏపీ ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, ఏఐటీయూసీ నాయకులు అన్వర్,ఇర్మియ, ఏఐఎస్ఎఫ్ నాయకులు గిరి,ఇబ్రహీం,రమేష్ ప్రజాశక్తి బుక్ హౌస్ మేనేజర్ మధు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కోడుమూరు : మార్చి 13న జరగబోయే పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ,పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో ప్రజా సమస్యల పరిష్కారం తోపాటు, అన్ని వర్గాల ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించే వ్యక్తులను శాసన మండలికి ఎన్నుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి కోరారు. ఈ మేరకు బుధవారం కోడుమూరు పట్టణంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బి రంగస్వామి మాట్లాడుతూ పిడిఎఫ్ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి,పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి,వేయించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వీరంజినేయులు,సిద్దు, ఉదయ్, మహమ్మద్ బాషా,తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.